# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే ఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
- సత్వర న్యాయానికి మధ్యవర్తిత్వం అసలైన పరిష్కారమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి పేర్కొన్నారు.
- రబీ సీజన్ లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు సాగు తాగు నీటిని ఇబ్బంది లేదని గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీర్ ఆర్ సతీష్ కుమార్ తెలిపారు.
- బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి కారణంగా రాష్ట్రంలో పలు జిల్లాలలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ శాఖ తెలియ జేసింది.

========================

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వస్తే సకాలంలో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి స్పష్టం చేశారు. వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనాతో కలిసి కార్యదర్శులు,ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో ఈ రోజు ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ వెబ్ సైట్లలో ప్రజా ప్రతినిధుల ఫోటోలు, ఆడియో వీడియోలు తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు పార్టీల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక కొత్త పథకాలు ప్రకటించడానికి వీలులేదని స్పష్టం చేశారు. బడ్జెట్ ప్రావిజన్ ఉన్నప్పటికీ నూతన ప్రాజెక్టులు, పథకాలు, రాయితీలు, గ్రాంట్లు మంజూరు, హామీలు ,శంకు స్థాపనలు పూర్తి నిషేధమని పేర్కొన్నారు.

========================

కోర్టులలో కేసులు పేరుకుపోతున్న నేపథ్యంలో సత్వర న్యాయానికి మధ్యవర్తిత్వం దోహదపడుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి పేర్కొన్నారు. సుప్రీం కోర్టు మీడియేషన్, కన్సీలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ సూచనలతో ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల కోసం ఏర్పాటు చేసిన అయిదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు. దుర్గాప్రసాదరావుతో కలిసి ఆయన ఈ రోజు

ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, న్యాయవాదులు మధ్యవర్తిత్వానికి సంబంధించిన మెలకువలు తెలుసుకొని కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శిక్షణ కార్యక్రమాన్ని న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

========================

గోదావరి డెల్టా సిస్టం పరిదిలోని ఉమ్మడి తూర్పు గోదావరి , ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల పరిది లో రబీ పంటకు సాగు నీటికి ఎటువంటి ఇబ్బంది లేదని ధవళేశ్వరం కార్యాలయం గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీర్ ఆర్ సతీష్ కుమార్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరి నదిలో నీటి లభ్యత ప్రస్తుతం సమృద్ధిగా ఉన్నదని ఆయన అన్నారు. ఉభయగోదావరి జిల్లాల పరిధిలో సాగు నీటికి గాని త్రాగునీటికి గాని, ఏ విధమయిన ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఇబ్బందులూ కలిగినట్లు అయితే సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు.

========================

భారత్ అమెరికా దేశాల మధ్య బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యానికి సూచికగా టైగర్ ట్రయంఫ్ 2024 విన్యాసాలు నిలిచిపోతాయని ఇరుదేశాల ఉమ్మడి ప్రతినిధులు ప్రకటించారు. భారత్ లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్, అమెరికా ఏడవ ఫ్లీట్ రిజర్వ్ వైస్ కమాండర్ జాకిన్ జే మారిటిన్జ్ డె పినిలోస్ తో కలిసి తూర్పునావికాదళ ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ఈ రోజు విశాఖలో జరిగిన ఉమ్మడి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇరుదేశాల మధ్య అత్యంత విశ్వసనీయ సంబంధాలు, ప్రపంచానికి తెలియజెప్పడం, శాంతిని పెంపొందించడమే ఈ విన్యాసాల లక్ష్యమని వివరించారు. కాగా, ఈనెలాఖరు వరకు ఈ విన్యాసాలు జరుగుతాయి

========================

తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జాతీయ గ్రంథాలయ అభివృద్ధి పై , ఐదు రోజుల సదస్సు ఈరోజు ప్రారంభమైంది. ఈ సదస్సును మానవ జీవపరిణామ క్రమ అధ్యయన సంస్థ జాతీయ సంచాలకులు బి.వి.శర్మ ప్రారంభించారు. మొత్తం ఏడు రాష్ట్రాల నుంచి వివిధ యూనివర్సిటీలకు చెందిన గ్రంథాలయ ఇన్ చార్జ్ లు సదస్సుకు హాజరయ్యారు. గ్రంథాలయాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలన్న విషయంపై ఈ ఐదురోజుల సదస్సులో చర్చించనున్నారు.

========================

విరామం

విజయనగరం జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు, కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్.పి. ఎం.దీపిక ఈ రోజు పరిశీలన చేశారు. జిల్లా కేంద్రంలోని ఓట్ల లెక్కింపు, ఈ.వి.ఎం. స్ట్రాంగ్ రూమ్ ల కోసం జిల్లాలోని వివిధ ఇంజనీరింగ్ కలాశాలలలోని గదులను గుర్తించి వాటిలో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

========================

సార్వత్రిక ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారం కోసం సువిదా పోర్టల్ ద్వారా తప్పకుండా అనుమతులు తీసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె. మాధవీలత కోరారు. ఈ రోజు కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, సువిధా పోర్టల్ కోసం పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో సువిధా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలియ చేశారు.

========================

ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్ ను, పోస్టర్లు , కటౌట్లను తొలగించామని శ్రీ సత్యసాయి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలిపారు. ఈ ఈ రోజు అయన పాత్రికేయులతో మాట్లాడుతూ, సీవిజిల్ యాప్ ను మరింత బలోపేతం చేస్తామని, యాప్ నుంచి వచ్చే ఫిర్యాదులకు 100 నిమిషాలలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

========================

బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి కారణంగా రానున్న మూడు రోజులలో రాష్ట్రంలో పలు జిల్లాలలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ శాఖ తెలిపింది. అ వివరాలను వాతావరణ శాఖ అధికారి ఆకాశవాణికి తెలియచేస్తూ..

(వాయిస్ 21 సెకన్లు)

========================

విశాఖ మీదుగా డిబ్రుగర్, కన్యాకుమారి మధ్య నడుస్తున్న వివేక్ ఎక్స్ ప్రెస్ సర్వీసుల ఫ్రీక్వెన్సీ పెంచుతున్నట్టు వాల్తేరు డివిజన్ రైల్వే అధికారులు తెలిపారు. ప్రస్తుతం వారానికి నాలుగు రోజులు నడుస్తున్న ఈ సర్వీసులు ఈనెల 22వ తేదీ నుంచి వారానికి ఐదు రోజులపాటు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

========================

ఎన్నికల నిబంధనలను అన్ని రాజకీయ పార్టీ నేతలు పాటించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ కోరారు. తిరుపతిలోని కలెక్టరేట్ లో ఈ రోజు పాత్రికేయులతో ఆయవ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తామన్నారు. తిరుపతి జిల్లాలో మొత్తం 2,136 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అలాగే, జిల్లా వ్యాప్తంగా 17 లక్షల 94 వేల 733 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 18 యేళ్ళు నిండి ఓటు హక్కును పొందిన ప్రతి ఒక్కరు ఓటును వినియోగించుకోవాలన్నారు.

========================

ఎన్నిక నియమావళి విధిగా పాటించాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోబిక అన్నారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు తహసీల్దార్ లు, ఇతర ఎన్నికల సిబ్బందితో ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని అన్నారు.

========================

తిరుమలలో ఈ నెల 20 వ తేదీ నుంచి 24 వరకూ శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు నిర్వహిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. రేపు రాత్రి ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకూ పుష్కరిణిలో స్వామీ అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇస్తారని పేర్కొన్నారు .

========================

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు,సిబ్బంది సమర్ధవంతంగా పనిచేయాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. ఈ రోజు జిల్లా కలెక్టరేటు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సాధారణ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల

నివేదికల సమర్పణ, సి.విజిల్, సువిద యాప్, కంట్రోల్ రూమ్ నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

=========================

అనకాపల్లి జిల్లాలోని 108 పరీక్ష కేంద్రాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారిని ఎం వెంకటలక్ష్మి తెలియజేశారు, ఈరోజు జరిగిన హిందీ పరీక్షకు 20 వేల 860 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారని, అలాగే,  ప్రయిపేటుగా మరో 93మంది హాజరయ్యారని వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని వెల్లడించారు.

=========================

=========================